
సాక్షి ఖమ్మం

శుక్రవారం । 6 । జూన్ । 2025



ఆయిల్ 'ఫామ్'లోకి వచ్చేలా..

జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తుండగా ప్రభుత్వం కూడా ప్రోత్సాహకాలు అందిస్తోంది. 10లో



ఫార్మసిస్టుల సంబరాలు

ఫార్మసిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం 'ఫార్మసీ ఆఫీసర్'గా ప్రమోషన్ ఇవ్వడంతో డీఎంహెచ్ఓ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. 10లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. సాయంత్రం వరకు వడ గాలుల ప్రభావం ఉంటుంది.

కుప్పలు.. తిప్పలు



ఖమ్మం ఖానాపురం కాల్వ కట్ట వద్ద ఉన్న రేషన్‌షాప్‌లో రద్దీ



ఎన్నెస్పీ క్యాంప్‌లోని షాప్‌లో క్యూలైన్



యూపీహెచ్ కాలనీలో రేషన్‌దుకాణం వద్ద జనం

ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా ఈసారి రేషన్ షాప్‌ల ద్వారా మూడు నెలల బియ్యం సరఫరా చేస్తోంది. గతంలో దొడ్డుబియ్యం ఇచ్చిన సమయాన ఆసక్తి చూపని లబ్ధిదారులు సన్నబియ్యం ఇస్తున్నప్పటి నుంచి తీసుకునేందుకు ముందుకొస్తున్నారు. ఇక ఒకేసారి మూడు నెలల బియ్యం ఇచ్చే క్రమాన లబ్ధిదారుల నుంచి మూడేసి సార్లు వేలిముద్ర నమోదు చేయాల్సి వస్తోంది. దీనికి తోడు తరచుగా రేషన్‌షాపుల్లో యంత్రాలు మొరాయిస్తుండడంతో ఏ షాప్ వద్ద చూసినా లబ్ధిదారులు భారీగా బారులుదీరి కనిపిస్తున్నారు. అయితే, ఈనెల 30వ తేదీ వరకు బియ్యం ఇస్తామని అధికారులు ప్రకటించడం కాస్త ఊరట కలిగిస్తోంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

న్యూస్‌రీల్

వెంకన్న సన్నిధిలో పాలకుర్తి ఎమ్మెల్యే పూజలు



స్వామివారి పాదాల వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, ఆమె అత్త ఝాన్సీరెడ్డితో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీవారికి, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలను ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి వారికి అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ముల్పూరి శ్రీనివాసరావు, నాయకులు వేమిరెడ్డి త్రివేణి, బాణావత్ శ్రీనివాసరావు, వేమిరెడ్డి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనాన్ని కాపాడాలి



ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయమూర్తులు, అటవీ అధికారులు

ఖమ్మం లీగల్ : భవిష్యత్ తరాల కోసం పచ్చదనాన్ని కాపాడడం అందరి బాధ్యత అని న్యాయమూర్తులు ఏపూరి బిందుప్రియ, నాగలక్ష్మి, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఖమ్మం వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో మొక్కలు నాటి.. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వాచ్ టవర్, నర్సరీ, బోటింగ్ ట్యాంక్, యోగా షెడ్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. పార్క్‌లో చేపట్టిన పరిశుభ్రత, మొక్కల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీజ



వైరాలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఎర్రుపాలెం: భూ భారతిలో పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన భూముల రీసర్వే వేగవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సర్వే సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ములుగుమాడులో నిర్వహిస్తున్న భూముల రీసర్వే తీరును గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వే ప్రక్రియ నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ తర్వాత బనిగండ్లపాడు ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసి, వైద్య సేవలు, పరీక్షలపై ఆరా తీశారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, అనుమతి లేకుండా గైర్హాజరు కావొద్దని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి..

వైరా: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల్లో నమ్మకం పెంచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. వైరాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఆమె రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు.

బెస్ట్ చదువు కోసం..



చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు పునాది

- బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తులు
- 1, 5వ తరగతుల్లో 259 మంది విద్యార్థులకు అవకాశం
- ఎంపిక చేసిన ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్లు

ఖమ్మంమయూరిసెంటర్: షెడ్యూల్డ్ కులాల విద్యార్థినీ, విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించేందుకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా 2025 – 26 విద్యాసంవత్సరంలో ఈ పథకం ద్వారా ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానించారు. ఐదో తరగతిలో రెసిడెన్షియల్ విధానం, ఒకటో తరగతిలో డే స్కాలర్లకు ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో 5వ తరగతికి 131, 1వ తరగతికి 128 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఆహ్వానం మేరకు ముందుకొచ్చే ప్రైవేట్ స్కూళ్లను బెస్ట్ అవైలబుల్ స్కూళ్లుగా ఎంపిక చేసి విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు.

రిజర్వేషన్లు ఇవే..

ఈ పథకం ద్వారా ఒక కుటుంబం నుంచి ఒక విద్యార్థికి మాత్రమే అవకాశం ఉంటుంది. విద్యార్థి తల్లిదండ్రులు డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హతలు కలిగి ఉండొద్దు. సీట్ల కేటాయింపులో ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయి. 50 శాతం సీట్లు వ్యవసాయ కూలీల పిల్లలకు, మొదటి తరం విద్యార్థులకు(కుటుంబంలో మొదటిసారి చదువుకుంటున్న వారికి) కేటాయిస్తారు. మిగిలిన 50 శాతంలో అనాథలకు 20 శాతం, జోగినుల పిల్లలకు 15 శాతం, బాండెడ్ లేబర్ పిల్లలకు 15 శాతం సీట్లు ఉంటాయి.

అందజేయాల్సిన పత్రాలు

దరఖాస్తుతో పాటు అధికారులు సూచించిన ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు జత చేయాలి. ఐదో తరగతిలో ప్రవేశానికి నాలుగో తరగతి మార్కుల జాబితా, ఒకటో తరగతికి పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం, రేషన్ లేదా ఆధార్ కార్డు జిరాక్సు, మీ–సేవ ద్వారా జారీ చేసిన నూతన కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు జత చేయాలి. ఈనెల 16న సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు ఫారాలను కలెక్టరేట్‌లోని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుల కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది.

ఎవరెవరు అర్హులు

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశానికి ప్రభుత్వం పలు అర్హతలను నిర్ణయించింది. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించొద్దు. జిల్లాకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఐదో తరగతిలో ప్రవేశానికి నాలుగో తరగతి ఉత్తీర్ణులైన వారు, ఒకటో తరగతిలో చేరేందుకు 2019 జూన్ 1 నుంచి 2020 మే 31 మధ్య జన్మించిన వారు (5 – 6 ఏళ్ల వయస్సు) అర్హులు. కాగా, విద్యార్థుల ఎంపిక ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా జరుగుతుంది. సీట్ల కేటాయింపులో ఎస్సీ కేటగిరీ –1 ఉపకులాల వారికి 1 శాతం, ఎస్సీ కేటగిరీ – 2 ఉపకులాల వారికి 9 శాతం, ఎస్సీ కేటగిరి – 3 ఉపకులాల వారికి 5 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఒకవేళ నిర్ణీత సీట్ల కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే డ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

ఎస్సీ విద్యార్థులకు మంచి అవకాశం



భవిష్యత్‌లో ఉన్నత విద్యను అభ్యసించేలా ఎస్సీ విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం దోహదపడుతుంది. ఈ పథకం ద్వారా జిల్లాలో ఎంపిక చేసిన ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం సీట్లు కేటాయించింది. బీఏఎస్ పాఠశాలల్లో వీరికి నాణ్యమైన విద్య అందుతుంది.

– కస్తాల సత్యనారాయణ, ఎస్సీ డీడీ

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

- ఆయిల్‌పామ్ వంటి లాభసాటి పంటలు సాగు చేయాలి
- రైతులకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచన



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

వైరారూరల్: రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మండలంలోని పూసలపాడులో గురువారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. సాదాబైనామా దరఖాస్తులు పరిష్కరించే క్రమంలో క్షేత్రస్థాయికి వెళ్లి భూమి ఎవరి కబ్జాలో ఉందో పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఆయా దరఖాస్తులను హైకోర్టు తీర్పు ప్రకారం పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో 600 మంది ప్రైవేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. త్వరలో గ్రామకంఠ సర్వేలు నిర్వహించి అసైన్మెంట్ భూములు పేదల వద్ద ఉంటే వారికి పట్టాలు ఇవ్వాలనే యోచనలో సర్కారు ఉందని తెలిపారు. భూ హక్కుల రికార్డులపై ప్రజలకు ఏమైనా అభ్యంతరాల పరిష్కారానికి తహసీల్దార్ నుంచి సీసీఎల్ఏ వరకు రెవెన్యూ కోర్టు వ్యవస్థ ఏర్పాటైందని, పైసా ఖర్చు లేకుండా భూ వివాదాలు పరిష్కారం అవుతాయని వివరించారు. రైతులు సంప్రదాయ పంటలే కాకుండా ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటలు సాగు చేయాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు..

ప్రైవేట్ స్కూళ్ల కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు వస్తున్నాయని, ప్రభుత్వ విద్యపై నమ్మకం ఉంచి తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ కోరారు. మండలంలోని నారపునేనిపల్లి యూపీఎస్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం విద్యా బోధన ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులను పాఠశాలకు తరలించేందుకు 7 సీటర్ ఆటోలను ఉదయం, సాయంత్రం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సులు ఏర్పాటు చేస్తున్నామని, 6 నెలల్లో స్పష్టమైన మార్పు వస్తుందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీఈఓ సామినేని సత్యనారాయణ, తహసీల్దార్ కె.వి. శ్రీనివాసరావు, ఎంపీడీఓ పి.సరస్వతి, ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అడ్మిషన్ల పెంపునకు బడిబాట

ఖమ్మంగాంధీచౌక్: ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట ద్వారా అడ్మిషన్లు పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఇందిరా డెయిరీ ఏర్పాటుకు రూపొందించిన ప్రణాళికను అమలు చేయాలన్నారు. ఈ రెండు అంశాలపై సంబంధిత అధికారులతో గురువారం ఐడీఓసీలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, నూతనంగా చేపట్టిన ఉపాధ్యాయుల నియామకం తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరించి అడ్మిషన్ల సంఖ్య పెంచాలని సూచించారు. పక్కా ప్రణాళికతో ఇందిరా డెయిరీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లక్ష్యం మేరకు గేదెల యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, డీఈఓ సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు, ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమాధికారులు కె.సత్యనారాయణ, జ్యోతి, విజయలక్ష్మి, పురంధర్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ 'ఎర్త్ సైన్సెస్'..

- కొత్తగూడెం వర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు
- తెలంగాణ కేబినెట్ సమావేశంలో లభించిన ఆమోదం
- జిల్లా ప్రజల్లో వ్యక్తమవుతున్న హర్షాతిరేకాలు



ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఇటీవల మంజూరైన ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా నామకరణం చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించింది. దీంతో జిల్లా ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

ప్రపంచంలోనే రెండోది

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్‌గా 50 ఏళ్ల క్రితం 300 ఎకరాల్లో మొదలై యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ (కాకతీయ)గా అప్‌గ్రేడ్ చెందిన కేఎస్‌ఎం ప్రస్థానంలో మరో ఎత్తుకు చేరుకుంది. ఇటీవల ఈ కాలేజీని యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. ఇప్పుడీ కాలేజీకి ఆర్థికవేత్త, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరును పెట్టింది. నాగరికతతో పాటు పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడంలో సహజ వనరులు కీలక పాత్ర పోషించనుంది. ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సులను అమలుతో జాతీయస్థాయిలో కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉంది. ప్రపంచంలోనే ఇలాంటి విశ్వవిద్యాలయం కేవలం అమెరికాలోనే ఉంది. రెండోది కొత్తగూడేనికి మంజూరైంది.

అందించే కోర్సులు

ప్రపంచంలో రెండో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కావడంతో దేశ విదేశాల నుంచి అధ్యాపకులు, విద్యార్థులు ఇక్కడకు వచ్చే అవకాశముంది. కాలేజీ రాకతో ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. వేలాదిమంది విద్యార్థుల ఉన్నత చదువులకు అవకాశాలు లభించడంతోపాటు శాస్త్రవేత్తలుగా తయారుచేసే అవకాశాలు ఉన్నాయి. ఎర్త్ సైన్సెస్ వర్సిటీతో జియో కెమిస్ట్రీ, జియో ఫిజిక్స్, ప్లానెట్రీ జియాలజీ, జియో మేరపాలజీ, స్ట్రక్చర్ జియాలజీ, ఖనిజ శాస్త్రం, పర్యావరణ భూగర్భ శాస్త్రం వంటి విభిన్న కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

కళకళలాడనున్న క్యాంపస్

గ్రాడ్యుయేషన్‌లో జియాలజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, జియో ఫిజిక్స్, జియో కెమిస్ట్రీ కోర్సులు ఉండగా పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో జియాలజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, జియో కెమిస్ట్రీ అందుబాటులోకి తేనున్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల మేరకు పీహెచ్‌డీ చేయొచ్చు. ఇప్పటికే క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విభాగంలో మైనింగ్, కంప్యూటర్‌సైన్స్, ఈఈఈ, ఈసీఈ, ఐటీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో ప్రతీ కోర్సులో 60 సీట్ల చొప్పున మొత్తం 780 సీట్లు ఇక్కడ అందుబాటులో ఉండగా ఎర్త్ సైన్సెస్ సబ్జెక్టులు రావడంతో ఈ సంఖ్య రెట్టింపు కానుంది.

అన్ని అనుకూలతలే..

దక్షిణ భారతదేశంలో ఖనిజనిధిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు పేరుంది. ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అన్ని అనుకూల వసతులు ఉన్నాయి. నేషనల్ హైవేకు సమీపంలో వర్సిటీ ఏర్పాటు చేస్తున్నారు. విశ్వవిద్యాలయం సమీపంలో మినీ స్టీల్ ప్లాంట్, నవభారత్ లిమిటెడ్, ఫెర్రో అల్లాయిస్, ఫెర్రో మెగ్నీషియం, విద్యుత్ ప్లాంట్లు కూడా ఉన్నాయి. జిల్లాలో ఐటీసీ పేపర్ బోర్డ్, హెవీ వాటర్ ప్లాంట్ ఉండగా, ఇక్కడికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో విమానాశ్రయాన్ని ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. త్వరలో ఈ కల నెరవేరనుంది. రోడ్డు, రైలు రవాణా మార్గాలు అతి సమీపంలో ఉన్నాయి. 35 కిలోమీటర్ల దూరంలో గోదావరి నది ప్రవహిస్తోంది. దీనివల్ల భవిష్యత్‌లో నీటి ఇబ్బందులు ఉండవు. ఇలా కొత్తగూడేనికి ఉన్న అనుకూలతలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని మంజూరు చేయించేందుకు మంత్రి తుమ్మల నిర్విరామంగా కృషి చేశారు. ఇప్పుడు మన్మోహన్‌సింగ్ పేరు పెట్టడంతో వర్సిటీపై దేశవ్యాప్తంగా చర్చ జరగనుంది.

గిరిజన సంక్షేమ శాఖలో దరఖాస్తుల ఆహ్వానం..

ఖమ్మంమయూరిసెంటర్ : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో 3, 5, 8 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. 3వ తరగతిలో 29, 5వ తరగతిలో 14, 8వ తరగతిలో 14.. మొత్తం 57 సీట్లు ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 17వ తేదీ లోగా ఐడీఓసీలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుకు కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు జత చేయాలని పేర్కొన్నారు.

విపత్తు సమయాల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న శ్రీలత

కూసుమంచి : విపత్తులు వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలత అధికారులను కోరారు. కూసుమంచి రైతువేదికలో గురువారం విపత్తుల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు, సిబ్బంది సమన్వయంగా ఉంటూ ప్రజలను అప్రమత్తం చేస్తే నష్టాన్ని తగ్గించవచ్చని అన్నారు. జిల్లా స్థాయి నుంచి ప్రమాద హెచ్చరికలు రాగానే ప్రతిస్పందిచాలని, వరదల సమయాల్లో ప్రాణనష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, వైద్యాధికారి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించగా మిల్లర్లు అధికంగా కోత పెడుతున్నారని పలువురు రైతులు శ్రీలతకు ఫిర్యాదు చేశారు. దీంతో రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలని ఏపీఎం తిరుమలరావుకు ఆమె సూచించారు.

పొంచి ఉన్న ముప్పు

- వానాకాలంలో అప్రమత్తత తప్పనిసరి
- సీజనల్ వ్యాధుల కట్టడికి వైద్య, ఆరోగ్య శాఖ ప్రణాళిక
- ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలని అవగాహన



ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. త్వరలోనే వర్షాకాలం సీజన్ పూర్తిస్థాయిలో మొదలుకానుంది. అయితే, వర్షాల కారణంగా రహదారుల వెంట, ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి దోమలు పెరిగితే వ్యాధుల వ్యాప్తికి ఆస్కారం ఉంది. ఈ నేపథ్యాన జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్య శాఖ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. జిల్లాలోని సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, పల్లె, పట్టణ దవాఖానాల పరిధిలో వ్యాధుల కట్టడికి వివిధ శాఖలతో కలిసి సంయుక్త కార్యాచరణకు సమాయత్తమైంది. సాధారణంగా వర్షాకాలం ప్రారంభంలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, విషజ్వరాలు వంటివి ప్రబలే ప్రమాదముంది. అయితే, వ్యాధుల వ్యాప్తి మొదలుకాక ముందే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు. వ్యాప్తి చెందిన తర్వాత కట్టడి చేయడం కంటే ముందుగా మేల్కొంటే మంచిదని అవగాహన కల్పిస్తున్నారు. ఇళ్లతో పాటు పరిసరాల్లో పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని చెబుతూ.. జిల్లాలో గతంలో కేసులు అధికంగా నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

ఇప్పటి వరకైతే తక్కువే..

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకైతే వ్యాధుల వ్యాప్తి తక్కువే. వాతావరణ మార్పులతో జలుబు, దగ్గు, విషజ్వరాలు నమోదైనా అంతగా ప్రభావం కనిపించలేదు. అలాగే డెంగీ కూడా ఇప్పటి వరకు మూడు కేసులే నమోదయ్యాయి. ఇక మలేరియా, చికున్‌గున్యా కేసులు ఒక్కటీ రాలేదు. కానీ గతంలో జిల్లాలో డెంగీ వైరస్ ప్రభావం తీవ్రంగా చూపించింది. జిల్లా వ్యాప్తంగా గత ఏడాది ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం 529 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం జిల్లాలో అక్కడక్కడా వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న వారు ఆస్పత్రుల్లో సంప్రదిస్తున్నా ఇబ్బందికర పరిస్థితులైతే లేవు. కానీ మున్ముందు డెంగీ కేసులు వెలుగు చూసే అవకాశాలు లేకపోలేదు. ఈనేపథ్యాన వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా చర్యలు చేపడుతూనే ప్రజలను సైతం అప్రమత్తం చేస్తున్నారు.

జిల్లాలో కొన్నేళ్లుగా నమోదైన వ్యాధుల వివరాలు

ఏడాది	డెంగీ	మలేరియా	చికున్‌గున్యా
2022	711	02	98
2023	530	-	-
2024	529	-	-
2025 (ఇప్పటివరకు)	03	-	-

ఇదీ ముందస్తు ప్రణాళిక

ఖాళీ స్థలాలు, సైడ్ డ్రెయిన్లు, కుండలు, పూలకుండీల్లో నీరు నిల్వ ఉండకుండా చూస్తూ ప్రతీ గ్రామం, డివిజన్లలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించనున్నారు. అలాగే, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో టిమోఫాస్, ఆయిల్ బాల్స్ వేస్తారు. టైర్లు, పాత సామగ్రి, కొబ్బరి బొండాల షాపుల యజమానులను అప్రమత్తం చేసి ఎక్కడ పడితే అక్కడ వాటిని పడేస్తే ఎదురయ్యే అనర్థాలను వివరిస్తారు. జ్వరం వచ్చిన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి స్థానికులకు పరీక్షలు నిర్వహిస్తారు. పాజిటివ్ కేసులు నమోదైన ఇళ్లు, సమీప నివాసాల్లో పైరిత్రమ్ స్ప్రే చేస్తారు. జన సంచారం ఉన్న ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాక ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే నిర్వహించడం, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఆర్ఆర్‌టీ బృందాల ఏర్పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పాజిటివ్ కేసుల సిరమ్ శాంపిళ్ల సేకరించడమే కాక అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టేలా కార్యాచరణ రూపొందించారు.

క్లుప్తంగా

మోడీ పాలనలో దేశం అభివృద్ధి


మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం : ప్రధానమంత్రి నరేంద్రమోడీ హయాంలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి, జాగృతి ఇండస్ట్రీస్ చెర్మన్ ఓ.శ్రీనివాసరెడ్డి అన్నారు. మోడీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి 11ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఖమ్మంలోని ఓ హోటల్‌లో గురువారం జిల్లా కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక అనేక సంస్కరణలు అమలు చేసిందని, ప్రజా సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ రాబోయే ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీ విజయదుందుభి మోగిస్తుందని అన్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌పై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, ఇటీవల ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో దేశ ప్రజలకు బీజేపీపై నమ్మకం పెరిగిందని అన్నారు. ఈ కార్యశాలలో పార్టీ రాష్ట్ర నాయకులు గెంటేలా విద్యాసాగర్, కూసంపూడి రవీందర్, శీలం పాపారావు, ఈవీ.రమేష్, నున్నా రవికుమార్, నంబూరి రామలింగేశ్వరరావు, అల్లిక అంజయ్యయాదవ్, శ్యాం రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తు నివారణ చర్యలపై అవగాహన


మాట్లాడుతున్న సంస్థ ఇన్‌స్పెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: విపత్తు సమయాన చేపట్టాల్సిన నివారణ చర్యలపై గురువారం స్థానిక ఎస్‌బీఐటీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలతో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్), హైదరాబాద్ విద్యార్థులకు స్కూల్ సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రామ్ పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమానికి జాతీయ విపత్తు నివారణ సంస్థ ఇన్‌స్పెక్టర్ గౌతమ్, వారి బృందం, జిల్లా విద్యాధికారి సామినేని సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విపత్తు సమయం చెప్పిరాదని, అది జరిగిన వెంటనే స్పందించేందుకు యువత ముందుండాలన్నారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ.. ఎన్‌డీఆర్‌ఎఫ్ సేవాలను కొనియాడుతూ.. గతేడాది ముంపు సమయాన యువత అందించిన సేవలను గుర్తుచేశారు. అనంతరం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి మాట్లాడుతూ.. అగ్నిప్రమాదం, వరదలు, భూకంపం వంటి విపత్కర పరిస్థితుల్లో అవలంబించాల్సిన కనీస ప్రమాణాలపై విద్యార్థులకు అవగాహన కలిగించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ జి.రాజ్‌కుమార్, కళాశాల అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న బీసీ గురుకుల ఉద్యోగులు

బోనకల్/ఖమ్మంమామిళ్లగూడెం: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న వత్సవాయి నరేశ్ ఇటీవల చింతకాని మండలం నాగులవంచ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఖమ్మం జిల్లా బీసీ గురుకుల ఉద్యోగులు తలాకొంత వేసుకుని రూ.2 లక్షలు సమకూర్చారు. ఈమేరకు గురువారం జిల్లా ఆర్‌సీఓ సీహెచ్.రాంబాబు, డీసీఓ సుష్మ, బోనకల్ పాఠశాల హెచ్‌ఎం జ్యోతిర్మయిలు మండలంలోని మోటమర్రి గ్రామంలోని మృతుడి అమ్మమ్మ, తాతయ్య వంగాల పద్మ, బ్రహ్మంలకు అందజేశారు.


మేడేపల్లి పంచాయతీకి పురస్కారం


పురస్కారం అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శి రమ్య

ముదిగొండ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మండలపరిధిలోని మేడేపల్లి గ్రామపంచాయతీ రాణించడంతో రాష్ట్రస్థాయి అవార్డు ఎంపికైంది. పర్యావరణం పరిరక్షణకు అమలు చేసిన విధానాలు, సేంద్రియ ఎరువు తయారీ, తడి,పొడి చెత్త వేరు చేయడం, వ్యర్థ పదార్థాల నిర్వహణ వంటి అంశాలను అమలు చేసినందుకు గాను ఎంపికై ంది. ఈమేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని టీజీపీసీబీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ చేతులమీదుగా పంచాయతీ కార్యదర్శి రమ్య గురువారం పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. దీంతో మండల అధికారులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఆయిల్ ‘ఫామ్’లోకి వచ్చేలా..

- జిల్లాలో 14,500 ఎకరాల్లో సాగుకు ప్రణాళిక
- ఆయిల్ ఫెడ్, గోద్రెజ్ కంపెనీల ద్వారా పంట సాగు
- ఇదే సమయాన పండ్లు, కూరగాయల తోటల సాగుకు ప్రోత్సాహం


ఆయిల్ పామ్ తోట

ఖమ్మంవ్యవసాయం: ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గత కొంత కాలంగా జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలకు తోడు, ఇక్కడి భూములు, వాతావరణం, నీటి లభ్యత అనుకూలిస్తుండడం, పంట కొనుగోలుకు పరిశ్రమలు ఉండడం సాగు విస్తీర్ణం పెరగడానికి దోహదపడుతున్నాయి. పోషకాలున్న పామ్ ఆయిల్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం పంట సాగుకు ప్రాధాన్యం ఇస్తుంది. పామ్ ఆయిల్ ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్ తదితర దేశాల నుంచి మన దేశానికి దిగుమతి అవుతున్న తరుణాన.. ఇక్కడ పంట సాగుకు వనరులుండడంతో పాటు డిమాండ్ కూడా ఉండడంతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణాన్ని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈనేపథ్యాన రాష్ట్రంలోని 27 జిల్లాల్లో పంట సాగుకు నేలలు అనుకూలంగా ఉండగా 2022 నుంచి 2027 వరకు 30 లక్షల ఎకరాల్లో పంటను సాగు చేయాలని నిర్దేశించింది. దీనిలో భాగంగా ప్రతి ఏటా పంట సాగు లక్ష్యాలను విధిస్తున్నారు. జిల్లాలో పంట సాగు విస్తీర్ణం 28,184 ఎకరాలు కాగా 2022 నుంచి 2025 వరకు మూడేళ్ల కాలంలో 21,390 ఎకరాల్లో సాగవుతోంది.

రూ. 56 కోట్ల నిధులతో..

జిల్లాలో 2025-26 సంవత్సరంలో రూ.56 కోట్లతో 14,500 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు ప్రణాళిక రూపొందించారు. నాలుగేళ్ల కాలపరిమితితో ఆయిల్ ఫెడ్ ద్వారా 9,250, గోద్రెజ్ ద్వారా 5,250 ఎకరాల్లో పంట సాగుకు నిర్ణయించారు. ఒక్కో ఎకరానికి డ్రిప్, మొక్కలు, అంతర పంటల సాగుకు రూ.38,600 చొప్పున ప్రోత్సాహకంగా అందిస్తున్నారు. డ్రిప్ పరికరాలకు మొదటి విడతలో 1,710 ఎకరాలకు గాను రూ.16.17 కోట్లను కేటాయించారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల వారికి 100 శాతం, వెనకబడిన తరుగుతులు, సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం రాయితీలు కల్పిస్తున్నారు. మొక్కలకు ఎకరాకు రూ.11,600 రాయితీతో పాటు అంతరపంటలకు ఎకరాకు రూ.4,200 రాయితీ అందించేలా నిర్ణయించారు. డిసెంబర్ నాటికి లక్ష్యాలను చేరే విధంగా ప్రణాళికలు రూపొందించారు.

పండ్ల తోటలకు ప్రోత్సాహకాలు

సమీకృత ఉద్యా మిషన్ పథకం ద్వారా పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహకాలను అందించేలా ప్రణాళిక రూపొందించారు. డ్రాగన్ ఫ్రూట్, అరటి, అంజీర, అవకాడో, బొప్పాయి, ఉసిరి, మామిడి, నిమ్మ, జామ, హైబ్రిడ్ కూరగాయలు, పూల తోటలను మొత్తం 227 హెక్టార్లలో పెంపకానికి రాయితీలు కల్పించారు. అంతేకాక 13 హెక్టార్లలో ముదరు మామిడి తోటల పునరుద్ధరణకు, 540 హెక్టార్లలో మల్చింగ్ షీట్లకు, రెండు ప్యాక్ హస్ యూనిట్లకు, ఉద్యాన యాంత్రీకరణ 63 యూనిట్లకు, ఫ్రూట్ కవర్లకు, వీడ్ మ్యాట్లకు నిధులు కేటాయించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద తీగజాతి కూరగాయల శాశ్వత పందిర్లు 50 యూనిట్లకు రూ. 25 లక్షలు కేటాయించారు. జాతీయ వెదురు మిషన్ పథకం కింద 50 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు రాయతీలను కల్పించారు. ఇందుకోసం రూ.7.20 లక్షలు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

ప్రోత్సాహకాలను వినియోగించుకోండి..



రైతుల ఆర్థిక బలోపేతం కోసం ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇందులో భాగంగా ఆయిల్ పామ్ సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. పంట సాగుతో అనేక ప్రయోజనాలుండగా.. మార్కెటింగ్‌కు జిల్లాలో పరిశ్రమలు కూడా నెలకొల్పబడి ఉన్నాయి. పండ్ల తోటలకూ ప్రోత్సాహకాలను అందిస్తున్న నేపథ్యాన ఆసక్తి కలిగిన రైతులు సమీప ఉద్యాన అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి.

– ఎం.వీ.మధుసూదన్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాధికారి

ఆసక్తి కలిగిన రైతులు సంప్రదించాల్సిన నంబర్లు

అధికారి	సెల్ నంబర్	మండలాలు
పి.అపర్ణ	89777 14104	కూసుమంచి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి
ఎ.విష్ణు	89777 14113	ముదిగొండ, చింతకాని, బోనకల్, మధిర, ఎర్రుపాలెం
ఎ.వేణు	89777 14105	వైరా, కొణిజర్ల, కామేపల్లి, సింగరేణి, ఏన్కూరు
జి.నగేష్	89777 14103	ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి
జి.శ్రావణి	89777 14114	సత్తుపల్లి, వేంసూరు

ఊడిన టాటా ఏస్ స్టీరింగ్..

ఆరుగురికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో పడిపోయిన క్షతగాత్రులు

ఇల్లెందురూరల్/కారేపల్లి: గుండాల మండలం కాచనపల్లి గ్రామం నుంచి కారేపల్లి మండలం పోలెంపల్లి గ్రామంలోని బంధువుల ఇంట్లో శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు టాటా ఏస్ వాహనంలో ఒక కుటుంబం గురువారం ఉదయం బయలుదేరింది. మార్గమధ్యలో ఇల్లెందు మండలంలోని రాజీవ్‌నగర్‌తండా శివారులో అకస్మాత్తుగా స్టీరింగ్ ఊడిపోవడంతో టాటాఏస్ వాహనం అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న పోలెబోయిన సుభద్ర, దొడ్ల నర్సమ్మ, రమేష్, పోలెబోయిన వెంకటనర్సు, పోలెబోయిన లక్ష్మి, డ్రైవర్ పూనెం కృష్ణలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స చేసి తీవ్రంగా గాయపడిన సుభద్ర, నర్సమ్మ, వెంకటనర్సులను మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు సిఫారసు చేశారు. మిగిలిన నలుగురికి ఆస్పత్రిలో వైద్యసాయం అందించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, రూ.100 వెరిఫికేషన్ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు.

టెన్నిస్ విజేతలకు బహుమతులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నెల రోజులుగా జరుగుతున్న లాన్ టెన్నిస్ సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టెన్నిస్ అసోసియేషన్ బాధ్యులు సత్యనారాయణ, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

‘శాయ్’ తనిఖీ తర్వాతే సింథటిక్ ట్రాక్ పనులు..

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఆధునిక సింథటిక్ ట్రాక్ పనులను ఇప్పటికే జిల్లా యువజన క్రీడల శాఖ లాంఛనంగా ప్రారంభించింది. అయితే, భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురు కాకుండా నిర్దేశిత నమూనాలతో నాణ్యతగా పనులు జరిగేలా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) అధికారులు పరిశీలించాకే పనులు మొదలు కానున్నాయని తెలిపారు. దీంతో శాయ్ అధికారులు ఎప్పుడు వస్తారని కాంట్రాక్టర్ ఎదురుచూస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ.8 కోట్ల నిధులు మంజూరైన విషయం విదితమే. ఇప్పటికే ట్రాక్ చుట్టు మట్టి తవ్వకం పూర్తిచేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముదిగొండ: పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా.. కోదాడ – ఖమ్మం జాతీయ రహదారిపై గేదెను ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వివరాల్లోకి వెళితే.. ఖమ్మంలో కార్పెంటర్ పనులు ముగించుకుని బైక్‌పై ఇద్దరు వ్యక్తులు నేలకొండపల్లి వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో ముదిగొండ సమీపానికి రాగానే రహదారిపై గేదెలను గమనించక బైక్ ఢీకొట్టడంతో వెనక కూర్చున్న గోవిందాచారి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి గాయాలయ్యాయి.

విద్యుదాఘాతంతో యువకుడు..

ఖమ్మం అర్బన్: కరెంట్ షాక్‌తో చేపలు పట్టే ప్రయత్నం ఓ యువకుడి ప్రాణాన్ని బలితీసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని 8వ డివిజన్ ఎల్బీనగర్‌కు చెందిన తురాయి రాజు(28) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం అతడు తన స్నేహితులు సైదులు, తురాయి వీరభద్రం, తురాయి శివలతో కలిసి ఇంటికి సమీపంలో ఉన్న ఎన్నెస్పీ కాలువ వద్ద కరెంట్ షాక్తో చేపలు పట్టేందుకు వెళ్లారు. కాలువ పక్కన ఉన్న కరెంట్ లైన్‌పై విద్యుత్ తీగను వేసి చేపలు పడుతుండగా రాజు ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడ్డాడు. వెంటనే విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోవడంతో స్నేహితులు అతడిని బయటకు తీసి 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించగా.. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అతడి స్నేహితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఖమ్మం అర్బన్ ఖానాపురం హవేలీ సీఐ ఆర్.భానుప్రకాష్ తెలిపారు.

కారు పల్టీకొట్టి డ్రైవర్..


ప్రమాదానికి గురైన కారు

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై గురువారం ఓ కారు పల్టీ కొట్టగా.. ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. కొత్తగూడెం బూడిదగడ్డ బస్తీకి చెందిన మహ్మద్ ఇబ్రహీం (25) గురువారం హైదరాబాద్ నుంచి ఖమ్మానికి కారులో వస్తుండగా.. జీళ్లచెరువు ఫ్లెటైవర్ పైకి రాగానే ఒక్కసారిగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. ఈఘటనలో ఇబ్రహీం అక్కడికక్కడే మృతిచెందగా.. హైవే పెట్రోలింగ్ సిబ్బంది సహకారంతో పోలీసులు మృతదేహాన్ని ఖమ్మం మార్చురీకి తరలించారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌గౌడ్

తిరుమలాయపాలెం: వైద్య సేవల్లో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం తిరుమలాయపాలెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వైద్యులు సమయపాలన పాటించడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఇక్కడ పని చేయడం ఇష్టం లేని వైద్యులు తమ వివరాలను తెలపాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు తిరుమలాయపాలెంపై ప్రత్యేక దృష్టి పెట్టారని, మెరుగైన వైద్యసేవలు అందించి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అమర్‌సింగ్, బొల్లికొండ శ్రీనివాసరావు, ప్రతాపరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ విజేతలకు బహుమతులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నెల రోజులుగా జరుగుతున్న లాన్ టెన్నిస్ సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టెన్నిస్ అసోసియేషన్ బాధ్యులు సత్యనారాయణ, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

తల్లాడ: మండలంలోని బిల్లుపాడుకు చెందిన పొర్లఖ నాగేంద్ర(62) తన మూడో కుమార్తెతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైంది. ఈఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నాగేంద్రకు నలుగురు కుమార్తెలు ఉండగా.. మూడో కుమార్తెతో గొడవపడి ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె చిన్న కుమార్తె అనూష ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

మహబూబాబాద్‌రూరల్: మహబూబాబాద్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన మూడేళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ గురువారం తీర్పు ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి.. మూడేళ్ల బాలికపై 2018 ఏప్రిల్ 30న ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయగా.. స్థానిక పోలీసు అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి అదే ఏడాది జూలై 19న కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన పీపీ గణేశ్ ఆనంద్ వాదనలు వినిపించగా పోలీసులు 16 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదోపవాదాలు విన్న తర్వాత నేరం రుజువు కావడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సంబరాలు


డీఎంహెచ్‌ఓను సన్మానిస్తున్న ఫార్మసిస్టులు

ఖమ్మంవైద్యవిభాగం: ఫార్మాసిస్టులను తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక గేజిట్ ద్వారా ‘ఫార్మసీ ఆఫీసర్’గా ప్రమోషన్ ఇచ్చిన సందర్భంగా గురువారం ఐడీఓసీ ప్రాంగణంలోని స్ఫూర్తి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య శాఖలో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్ల లాగే పేషంట్లను ఆరోగ్యవంతులుగా చేయడంలో ఫార్మసీ ఆఫీసర్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్నారు. అసోసియేషన్ అభ్యర్థన మేరకు ఆదేశాలు అందిన నేపథ్యాన ఇకనుంచి ఫార్మాసిస్ట్ గ్రేడ్-1ను సీనియర్ ఫార్మసీ ఆఫీసర్‌గా, గ్రేడ్-2ను ఫార్మసీ ఆఫీసర్‌గా, జిల్లా ఫార్మసీ సూపర్‌వైజర్‌ను జిల్లా ఫార్మసీ ఆఫీసర్‌గా మారుస్తూ జీఓ నంబర్ 71 ద్వారా తెలియజేయడం అభినందనీయమన్నారు. ఫార్మాసీ ఆఫీసర్లు ఈ ఔషధి పోర్టల్‌లో కూడా మందుల వివరాలు అన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. అనంతరం డీఎంహెచ్‌ఓను ఫార్మసిస్టులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చందు నాయక్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ రామారావు, స్టాటిస్టికల్ ఆఫీసర్ నవీన్, జిల్లా ఫార్మసీ ఆఫీసర్ (ఇన్‌చార్జ్) మోహన్, సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ఫార్మసీ ఆఫీసర్ మంగీలాల్, పద్మ, లింగమూర్తి, ఫార్మసీ అధికారులు పాల్గొన్నారు.

అర్బన్ మలేరియా సిబ్బంది విధుల పరిశీలన


సిబ్బంది విధులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని మున్సిపాటిలీ కార్యాలయంలో గల అర్బన్ మలేరియా పథకంలో పనిచేస్తున్న సిబ్బంది విధులను గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.కళావతిబాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ మన్నన్, హెల్త్ అసిస్టెంట్ హరీష్, ఫీల్డ్‌వర్కర్ రామకృష్ణలతో కలిసి క్షేత్రస్థాయిలో సిబ్బంది అటెండెన్స్‌తో పాటు విధులను పరిశీలించారు. అనంతరం రోటరీనగర్, లెనిన్‌నగర్, సారథినగర్ ప్రాంతాల్లోని మురికి కాల్వల్లో ఆంటీ లార్వ స్ప్రే పనులను పరిశీలించి దోమల నివారణపై పలు సూచనలు చేశారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే పాటించాలని, జ్వరం వచ్చిన వెంటనే మలేరియ, డెంగీ పరీక్షలు చేయించాలన్నారు. పాజిటివ్‌గా నమోదైతే ఆ ఇంటి పరిసరాలలో ఇండోర్ రెసిడ్యుయల్ స్ప్రే చేయించి ఇతరులకు సంక్రమించకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో అందరూ క్షేత్రస్థాయిల్లో ఉండి విధుల్ని నిర్వర్తించాలని, కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

పెరిగిన ఎండ తీవ్రత



ఖమ్మంవ్యవసాయం: ఎండ తీవ్రత పెరిగింది. గురువారం అత్యధికంగా తల్లాడ మండలం కుర్నవల్లిలో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో 40.1 డిగ్రీలుగా నమోదు కాగా, తల్లాడలో 39.9, వైరాలో 39.8, పల్లెగూడెం, గౌరారంలో 39.6, కాకరవాయిలో 39.5, వైరా ఏఆర్‌ఎస్ వద్ద 39, ఖమ్మం ప్రకాశ్‌నగర్, పెద్దగోపతిలో 38.9, ముదిగొండ, ఎర్రుపాలెంలో 38.8, పమ్మి, కల్లూరు, పెనుబల్లిలో 38.7, వేంసూరు, చింతకానిలో 38.6, కొణిజర్ల, బాణాపురం, ఏన్కూర్‌లో 38.4, నేలకొండపల్లి, మధిరలో 38.3, మధిర ఏఆర్‌ఎస్, ఖమ్మం ఖానాపురం, సత్తుపల్లి ఓసీల వద్ద 38.2, సత్తుపల్లి, రావినూతల, ఖమ్మం ఎన్‌ఎస్‌పీ గెస్ట్‌హౌస్ వద్ద 38.1, సదాశివునిపాలెంలో 38, గేటుకారేపల్లి, రఘునాథపాలెం, లింగాల, సిరిపురంలలో 37.9, కూసుమంచి, నాగులవంచ, గంగారం, పంగిడి, తిరుమలాయపాలెంలో 37.8, తిమ్మారావుపేట 37.7, గుబ్బగురి, మంచుకొండలలో 37.5, ఖమ్మం కలెక్టరేట్ వద్ద 35.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడగా.. రైతులు మాత్రం పంటల సాగుకు దుక్కలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

కవల దూడలు జననం..

కృత్రిమ గర్భధారణ ద్వారా ఓ ఆవు రెండు మగ దూడలకు జన్మనిచ్చింది. స్థానిక శ్రీనివాసకాలనీకి చెందిన కిలారు సత్యనారాయణ నివాసంలో గురువారం హెచ్‌ఎఫ్ జాతి ఆవుకు రెండు దూడలు జన్మించగా.. రెండూ ఆరోగ్యంగానే ఉన్నాయి. కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మనించడం అరుదుగా జరుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. – పాల్వంచ



మతిస్థిమితం లేని వృద్ధురాలి మృతి


ఖాదర్‌బీ (ఫైల్)

సత్తుపల్లి: మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు స్థానిక తామరచెరువు వద్ద అటవీ ప్రాంతంలో మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పట్టణంలోని విద్యానగర్ రోడ్డుకు చెందిన ఎస్‌కె.ఖాదర్‌బీ(70) మతిస్థిమితం లేకపోవడంతో తామరచెరువు సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లి వడదెబ్బతో మృతి చెందింది. దీంతో అటవీశాఖ ఉద్యోగులు ఆమె మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతురాలికి ఒక కుమారుడు ఉండగా.. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.